# మీరైనా చెబుదురూ!

వి.వి.ఎల్. సావిత్రి




**ఎలాంటి వ్యసనాలు లేకుండా జీవితం గడపడం బుద్ధిమంతుల లక్షణం రా! అంటుండేది మా బామ్మ. అసలు వ్యసనాలు లేని మనిషుంటాడా? ఏ మనిషికైనా వ్యసనం అనేది జీవితంలో అంతర్భాగమే అంటాన్నేను. తాగుడు, సిగరెట్, చెడు తిరుగుళ్ళు గట్రా గట్రా దుర్వ్యసనాలే అయితే మరీ నోరు కట్టుకు కూర్చోడం కూడా ఒక రకమైన జబ్బేననిపిస్తుంది నాకు. వయసు పోరు, వరద హోరు నాకు ఒకలాగే అగుపిస్తాయి.**

ప్రకృతి వైపరీత్యానికి విరుగుడు ఎలా లేదో కొన్ని కొన్ని బలహీనతలను జయించడం మానవ తరమూ కాదు, మానవ లక్షణమూ కాదనేది నా ఫిలాసఫీ. అన్ని సరిగ్గా ఉంటే మనిషెందుకవుతాడు అనేది నా డౌటు. ఆ మాటకొస్తే ఏ సరదాలు లేకుండా ఒక గిరి గీసుకుని కూర్చుని నన్ను ముట్టుకోకు నా మాల కాకీ అన్నట్లుగా అఘోరించడం కూడా జబ్బే. అతిగా దణ్ణాలు పెట్టడం, పచ్చి గంగైనా ముట్టకుండా దైవప్రార్థన చేయడం, మితంగా మాట్లాడ్డం, మితంగా తినడం, మితంగా సంతోషించడం ఇవన్నీ సత్పురుషుల లక్షణాలు బామ్మ భాషలో. కానీ కోరికను అణుచుకోకుండా ఎప్పటికపుడు తీర్చుకోవడం నా భాషలో మంచి లక్షణం. ఇందులో తప్పేముంది? మనిషైన తర్వాత ఏదో ఒక వీక్‌నెస్ ఉంటూనే ఉంటుంది. చూసీ చూడనట్టు పోతేనే కదా సంసారం సాఫీగా సాగేది అనేది నా వాదన. కానీ నాభార్య అందుకు విరుద్ధం.

'అలా మీ ఇష్టానుసారం ప్రవర్తిస్తూ, కోరికలకు హద్దుల్లేకుండా వ్యవహరించే మనిషే అయితే అసలు పెళ్ళెందుకు చేసుకున్నారు? అలా మీ ఇష్టానుసారం ప్రవర్తించి చివరకు నాకూ పిల్లలకు ఏం మిగులుస్తారు మీరు? మరీ విడ్డూరంగా తయారైంది మీ వ్యవహారం. డాక్టరు సలహాలు సైతం పెడచెవిన పెట్టి మరీ వ్యవహరిస్తున్నారు? ఏం అంత అణుచుకోలేనిదా మీ కోరిక?' అంటూ నిలదీస్తుంది నా భార్య.

'ఈయన ఇలా ఈపాడు అలవాటు తోటే ఏదో నాడు నాకూ నా పిల్లలకు అన్యాయం చేసి వెళ్ళిపోతారేమో వదినా!' అంటూ పొరుగింటి వారితోనూ, ఇంటికొచ్చిన చుట్టాలముందూ వాపోయి కొంగు నోట కుక్కుకుని కన్నీరు పెట్టుకుంటుంది అపుడపుడు.

నా జీవితంలో ఈ సీన్లు అంతర్భాగమైపోయాయి. అసలు నాకున్నది వ్యసనమా? కోరికా, ఇష్టమా? లేక బలహీనతా... ఏదీ నాకే తెలటం లేదు. ఎందుకో దాన్ని చూస్తే మాత్రం వదల బుద్ధికాదు. అసలు ఏం చూసి దాని మాయలో పడ్డాను? ఆవురావురనిపించే రూపమా? లేక ఆకర్షణీయమైన రంగా? ఏం ఉందని దాన్లో? బామ్మ అమ్మ, భార్య, డాక్టరు ఇలా అందరూ ఎన్ని హితోపదేశాలు చేసినా ఎందుకు నేను మానుకోలేకపోతున్నాను? ఎవరూ ఇంట్లో లేకపోతే ఇక నా వీక్‌నెస్‌కు హద్దే ఉండదు. తలుపులు మూసి ఆ పనికాస్తా కానివ్వకపోతే మనసు లాగేస్తుంది. ఈ ఒక్క బలహీనతనీ ఎందుకు జయించలేకపోతున్నాను? కొన్ని వందల సిగరెట్లు తాగి ఆలోచించి నా సమాధానం దొరకటం లేదు. నా అలవాటు మాన్పించాలని కొన్నాళ్ళు దాన్ని ఇంట్లోనే లేకుండా చేశారు. కానీ అది లేకపోతే ఇల్లు గడవదు. మరీ ప్రత్యేకించి వంట్లో నలతగా ఉండి మా ఆవిడ వంట చేయలేకపోయినా, గభాల్న నలుగురు చుట్టాలొచ్చినా అది లేకపోతే పనే జరగదు. మా ఆవిడకైతే చెయ్యి విరుచుకున్నట్లుంటుంది అది లేకపోతే. భోజనాల దగ్గర మరీ ఆధారపడిపోతుంది దానిమీద. ఇలా ఇంట్లో అంత అవసరమున్నదాన్ని నా ఒక్కడికోసం వాళ్ళెలా మానుకోగలరు. వయోభారం వల్ల మా ఆవిడ కూడా పని నెమ్మదిగా చేస్తోంది. చచ్చీ చెడీ వంట వండడానికే తాతలు దిగొస్తున్నారు.

'అలా అని ఉందని విపరీతంగా దాని మీదే ఆధారపడితే ఎలాగండీ? నలుగురూ ఉంటే ఎలాగూ తప్పదు' అంటూ సాగదీస్తుంది నా భార్య.

అసలు నాకీ వీక్‌నెస్ ఉరఫ్, ఇష్టం లేదా దుర్బుద్ధి పన్నెండేళ్ళ వయసులో ఆరంభమైంది. అపుడే కదా జీవితంలో రెండో ఘట్టమైన యవ్వనదశ ఆరంభమైయేది. అపుడే కొత్త క్రొత్త రుచులు అలవాట్లయ్యేది. అదే అత్యంత కీలకమైన ఘట్టం. మనిషిలో మనసు ఉందన్న విషయం చూచాయగా అపుడే బయటపడుతుంది. కొత్త కోరికలు పురులు విప్పే వయసు. ఎవరేమన్నా సిగ్గుపడకుండా అనుకున్న కోరిక తీర్చేసుకోవాలన్న ఆరాటం, పట్టుదల, పౌరుషం, పొగరు ఇలా అన్ని లక్షణాలకు నాందీ వాచకం పలికేది ఆ వయస్సే. సరిగ్గా ఆ వయసులోనే నేను దాని మోజులో పడ్డాను. వయోభారం వల్ల సరిగ్గా గుర్తులేదు కానీ బహుశా మా మేనత్త పెళ్ళిలో గామోసు. తొలిసారిగా దాన్ని చూసాను. దాని రంగూ, కటుక్కున కొరికేయాలనిపించే రూపం, ఆకర్షణ నన్ను వివశుణ్ణి చేశాయి. దీన్ని ఓ పట్టు పట్టాల్సిందేననే కసిని పెంచింది నాలో! హోరు హోరున పెళ్లి జరుగుతుండగా భోజనాల సమయంలో అలా కనీ కనిపించనట్లు మాయమైన నా హృదయేశ్వరిపై నా కళ్లు పడనే పడ్డాయి. దాని ఆరా తీయాలి. కనిపించి మాయమైన ఆ వన్నెలాడిని జీవితంలో ఒదలగూడదు. మిసమిసలాడే ఎరుపు, కవ్వించే ఆకర్షణ... ఒకసారి దాని అంతు చూడాల్సిందే. కళ్ళని కవ్వించే లుక్కు అనుకుంటుండగానే వడ్డించేవారిలో కలిసిపోయి వెళ్ళిపోయిందది. అప్పటినుండే నా మనసు మనసులో లేదు. ఎలాగైతేనేం మరుసటి రోజు మధ్యాహ్నం అందరూ అప్పగింతల సీనులో ఉండే వేళ చూసుకుని ఒంటరిగా ఉన్న దాన్ని దొరకబుచ్చుకుందామని వంటింట్లో కెళ్ళాను. కంటికి కసెక్కించే రూపంతో కనిపిస్తున్న దాన్ని అందుకుందామని సరిగ్గా చేయివేయబోయే లోగానే బామ్మ వంటింట్లోకొచ్చింది. అంతే నా సంతోషం, దాన్ని పట్టుకోవాలన్న నా ఆరాటం మీద నీళ్ళు కుమ్మరిం


చినట్టైంది. మళ్ళీమళ్ళీ అవకాశం దొరకదాయే. బామ్మమీద కోపం కూడా వచ్చింది నాకు. అయినా సరే తమాయించుకున్నాను. నా ఆతృత కనిపెట్టిన బామ్మ చిన్న పిల్లాడివి. ఇప్పటినుండీ నీకెందుకురా నాన్నా ఈ పాడలవాట్లు. ఇంకేమన్నా కావాలంటే ఇస్తాను గానీ దాని జోలికి పోకురా అంటూ దాన్ని కాస్తా నాకు దూరం చేసేసింది. చిన్నప్పటినుండి నాకో వీక్‌నెస్. ఎవరైనా ఏదైనా వద్దంటే నామనసుఅటే పరుగులు తీస్తుంది. ఏది వద్దో అదే చేయాలనే తపన. ఎవరైనా పొగరుగా, ఛాలెంజింగ్‌గా ఉంటే నాలో పౌరుషాగ్ని బుసలు కొట్టేది. తక్షణం వాళ్ళ తుప్పు ఒదలగొట్టడమే ధ్యేయమన్నట్లు రంగంలోకి దిగేవాణ్ణి. ఇంతకీ చెప్పొచ్చే దేంటంటే మేనత్త పెళ్ళి ఆర్భటంగా అయిపోగానే మరుసటి రోజు అమ్మ మూటాముళ్ళు సర్దింది. నాన్న జట్కా తీసుకొచ్చాడు. దాన్ని కూడా తీసుకొస్తే బాగుణ్ణు అనుకుంటుండగానే ఇక్కడుంచి దాన్ని మాత్రం ఏం చేయాలిలే. దాన్ని నీకూడా తీసుకుపో అని బామ్మ అనడం తక్షణం అమ్మ దాన్ని కూడా మావూరు తీసుకొచ్చింది. అప్పటినుండి నాకు ఏకాంతమే గగనమైందాయే. దాన్ని ఎపుడు దొరకబుచ్చుకుందామన్నా అమ్మ కాపలాగా ఉండేది. నాలో కోరిక సెగలు కక్కేది. ఎపుడైనా వంటరిగా దొరక్కపోదా అని ఎదురు చూస్తుండేవాడిని. అమ్మ బజారెళ్ళినా, పొరుగింట్లోపేరంటానికి వెళ్ళినా ఇక నాకు ఆటవిడుపే. బహుశా ఆ స్వేచ్ఛే నాలో ఈ బలహీనతను అధికం చేసింది. ఎవరైనా వచ్చేస్తారేమోనని తలుపులేసి కంగారుపడుతూ పనికానిచ్చేయడం అలవాటుగా మారిపోయింది. వయసు వేడిలో నా కోరిక వల్ల దుష్ప్రభావాలేవీ నాకు కనపడలేదు. వివాహం ఆ తర్వాత, పిల్లలు నాజీవితంలో ప్రవేశించినా దాన్ని మాత్రం నానుండి ఎవరూ వేరు చేయలేకపోయారు. మా ఇద్దరి మధ్య బంధం అటువంటిది. ఏ విషయమైనా నా భార్యకు స్పష్టంగా చెప్పేయడమే మంచిదనుకున్న నేను మా శోభనం నాటి రాత్రే నా బలహీనత గురించి ఆమెకు వివరంగా చెప్పాను. అంతా విని నోరు వెళ్ళబెట్టిందావిడ.

‘ఛీ పాడు గుణం, ఇదేం విడ్డూరం. పైగా అలా ఇష్టానికి అద్దు అదుపు లేకుండా పోతే ఆరోగ్యం ఏం కాను?’ అంటూ సణిగింది. మొదట్లో చాలా చిరాకు పడేది. ఆ తర్వాత ఇక ఆయన మారరు. ఆయన నైజం అంతే అనుకుంది మా ఆవిడ. చూసీచూడనట్లు ఊరుకునేది. కాలప్రవాహంలో నాకు ముగ్గురు పిల్లలు కూడా కలిగారు. నాకున్న ఈ బలహీనత నా పిల్లలకి రాకూడదనుకునే వాణ్ణి. నడి వయసు వచ్చే నాటికి నా బలహీనత తాలూకు ప్రభావం నాపై చూపనారంభించింది. తరచుగా డాక్టరు వద్దకు వెళ్ళడం. డాక్టరు ఏవో మందులు రాయడం. వాటిని వాడడం మళ్ళీ నా అలవాటును కొనసాగించడం ఇలా మరో పదిహేనేళ్ళు గడిచాయి. ఇన్నేళ్ళు గడిచినా నాకు దాంతో అనుబంధం సడలలేదు. మీరు నన్నైనా వదులుకుంటారేమో కానీ దాన్ని మాత్రం వదలరు అంటూ నా భార్య రుసరుసలాడేది. అడపా దడపా డాక్టరు ఖర్చులకు అస్తమాను వాళ్ళు రాసే టెస్టులకీ అదనంగా సొమ్ము వెచ్చించాల్సి రావడం నన్నిబ్బంది పెట్టేది. సర్వకాల సర్వావస్థల్లోనూ అదే కావాలని మనసు ఆరాటం చెందేది. నా సంసారంలో కోపతాపాలకు, ఘర్షణలకు అపుడపుడు అదే కారణమవుతున్నా దాన్ని ఒక్క మాటంటే సహించలేకపోయేవాడిని. అన్నకొద్దీ అదేపనిచేసే తత్వం గల వాణ్ణి గనక ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా నా మోజు తీర్చుకునే వాణ్ణి. చివరికి మా పెద్దబ్బాయి పెళ్ళిలో అనుకుంటా నాకు బాగా సుస్తీ చేసింది. అసలు పీటల మీద కూర్చుని తతంగం జరిపించగలనా అనే భయం కూడా వేసింది. ఎన్ని పనుల్లో ఉన్నా రోజూ ఉదయం, సాయంత్రం డాక్టరు ఇంటికొచ్చి నా ఆరోగ్యాన్ని పరీక్షించి మందులన్నీ తనే స్వయంగా నాచేత మింగించి వెళ్ళేవాడు. మా ఆవిడ ఎక్కడ తిడుతుందో అని లేని ఓపికను తెచ్చుకుని ఆ శుభఘడియ ఏ అవాంతరాలు లేకుండా జరిపించేశాను.

**మా ఆవిడ ఆ కొత్త కోడలికి ఇంటి స్థితిగతులన్నీ వివరిస్తూ నా వీక్‌నెస్ గురించి కూడా చెప్పేసింది. అది విన్న నా కోడలు కాఫీ అందిస్తూ ముసి ముసిగా నవ్వుకుని వెళ్ళిపోతుంటే నాక్కాస్త సిగ్గనిపించింది. కానీ మరుక్షణం ఎప్పటి కోరికలు అపుడే తీర్చేసుకోవాలన్న నా సిద్ధాంతం గుర్తు రాగానే ఆ సిగ్గు కాస్తా మాయమైంది**

మా ఆవిడ ఆ కొత్త కోడలికి ఇంటి స్థితిగతులన్నీ వివరిస్తూ నా వీక్‌నెస్ గురించి కూడా చెప్పేసింది. అది విన్న నా కోడలు కాఫీ అందిస్తూ ముసిముసిగా నవ్వుకుని వెళ్ళిపోతుంటే నాక్కాస్త సిగ్గనిపించింది. కానీ మరుక్షణం ఎప్పటి కోరికలు అపుడే తీర్చేసుకోవాలన్న నా సిద్ధాంతం గుర్తు రాగానే ఆ సిగ్గు కాస్తా మాయమైంది. వచ్చిన చిక్కల్లా మా ఆవిడ నా వీక్‌నెస్ గురించి కోడలికి చెప్పడమే కాక ఓ కంట కనిపెట్టమని ఆ పాడుబుద్ధి ఏ క్షణాన్నైనా వికటించచ్చనీ హెచ్చరించింది. అప్పటినుండి నా కోడలు నాపై నిఘా వేసి ఉంచడం వల్ల నా కోరిక తీరే మార్గం అవకాశం తగ్గుతూ వచ్చింది. నాలో అసహనం పెల్లుబుకుతూ వస్తోంది. మా రెండోవాడైన భాస్కరం పెళ్ళి కూడా కిందటేడాది శ్రావణ మాసంలో ఘనంగా జరిగిపోయింది. మారెండో కోడలు కూడా కాపురానికి వచ్చే సరికి ఇల్లు ఇరకటం, ఆలి మరకటంలా అయింది నా పరిస్థితి. మరో జత కళ్ళు నా కార్యకలాపాలపైనా, అలవాట్లపైనా నిఘా వేశాయి. గతంలో మల్లే వంటింట్లోకి చొరబడలేను. ఇన్నాళ్ళుగా అలవాటైన రుచులు ఒక్కసారిగా వదులుకోవాలంటే కష్టమే మరి! పోనీ ఎవరింటికైనా వెళ్ళి నా పరిస్థితిని వివరంగా చెప్పి నా కోరిక తీర్చమని అడగలేని పరిస్థితి. ఇంట్లో అందరు ఉండగా దిక్కులేని వాడిలాగా ఇలా వచ్చి అడుగుతున్నాడేమిటబ్బా అని నలుగురూ నవ్విపోతారేమో అని మరో గుబులు. జటిల సమస్యలని ప్రాణంగా ఉండే స్నేహితులతో చర్చిస్తే కొంత ఉపశమనం. అందుకే రామశేషు ఇంటికి వెళ్ళాను. విషయం వివరించాను. ముందొక్క క్షణం పాటు బిత్తరపోయాడు. నా సమస్య వివరించడానికి నేనిచ్చిన ఉపోద్ఘాతం విని అదేదో తీవ్రమైన కుటుంబ సమస్య అయి ఉంటుందనుకున్నాడు మొదట. కోడళ్ళు వచ్చిన తర్వాత ఇంట్లో సహజంగా వచ్చే కీచులాటల వల్ల నా మనసు గాయపడిందని, ఆ బాధ వెళ్ళగక్కడానికే వచ్చానని అనుకున్నాడు. కానీ నా బలహీనత, దాని పర్యవసానాలు ఆసాంతం విన్నాక పకపకా నవ్వడం ఆరంభించాడు. ఇదో సమస్యా, దీనికో పరిష్కారం చెప్పాలా? అని ఆశ్చర్యపోయాడు. కానీ ఆ సమస్య వల్ల తలెత్తుతున్న ఇతర సమస్యలను ఏకరువు పెట్టే సరికి అర్థం చేసుకున్నాడు. వయసు మీద పడుతున్నా కోరికలకు హద్దులేవేంట్రా అని కేకలేశాడు. నా ప్రాణంరా అది! అది లేపోతే నేనుండలేను. దానివల్ల నా ఆయుష్షు తగ్గినా, రోగాలు తిరగబెట్టినా, ఆరునూరైనా దాన్ని వదిలేది లేదు అంటూ నా వీక్‌నెస్ తాలూకు తీవ్రతని వెల్లడించాను. ఇదెక్కడి చోద్యంరా! వయసు పైబడేదే కానీ తగ్గేది కాదుగదా! ఆరోగ్యవంటే ఆషామాషీగా ఉందా... వయసు తెచ్చిన పెద్దరికాన్ని గుర్తించి శరీరానికి విశ్రాంతి నివ్వాలి. రుచులకీ ఒక హద్దుండాలిరా. రేపటినుండి నువు దాని ముఖం చూడటం లేదంతే అంటూ శాసించాడు. నీ అలవాట్లు చూసి నీ మనవలు కూడా నవ్విపోతార్రా అంటూ చీవాట్లేశాడు. ఆ చీవాట్లతో నా మెదడు కాస్తా మొద్దుబారిపోయింది. ఏదో జిహ్వా చాపల్యం కొద్దీ నవ నవలాడే కొత్తావకాయని ఎడాపెడా ఆరగించడమనే నా వీక్‌నెస్ ఇంతమందిచేత చీవాట్లు తినిపించింది. ఎర్రని రంగు, ఘాటైన వాసన నా మదిలో ఏన్నాళ్ళైనా చెరగని ముద్ర వేసుకున్నాయి. ప్రపంచంలో ఏ మూలకెళ్ళినా అందరూ ఆతృతగా ఇష్టపడే ఈ తెలుగు పచ్చడిపైనే నా మక్కువ, మోజూను. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లుగా ఏన్నాళ్ళైనా, ఎన్నేళ్ళైనా ఆవకాయ అంటే నాకు ప్రీతి. జిహ్వాకో రుచి పుర్రెకో బుద్ధి అన్నట్లుగా అదంటే నాకిప్పటికీ, ఎప్పటికీ మోజే. తెలుగువారి జీవితంలో మమేకమైన ఆవకాయని నాజీవితంలో అంతర్భాగం చేసుకోవడం తప్పంటారా? మీరైనా చెబుదురూ! •

## దీపను ఆకట్టుకోలేకపోయిన టాబు!



**గు**ల్జార్ నుంచి గోవింద్ నిహలానీ వంటి ఆర్ట్ ఫిలం డైరెక్టర్ల అభిమానాన్ని సంపాదించుకున్న టాబు ఎందుకోగానీ దీపామెహతా మనసును ఆకట్టుకోలేకపోయింది. తన ‘వాటర్’ చిత్రంలో మూడో వితంతువు పాత్రను టాబుకు ఇవ్వాలనుకున్న దీప ఆ తర్వాత తన మనసు మార్చుకున్నట్టుంది. ఈ విషయమై టాబును అడిగితే దీపా ఆఫీసు నుంచి ఒకసారి తనకు ఫోను వచ్చిన మాట నిజమేనంటూ ఒప్పుకుంది. కాని ఆ తర్వాత వాళ్ళు మళ్ళీ నన్ను కాంటాక్ట్ చేయలేదని తనే చెప్పింది. తనకు అవకాశం ఇచ్చినా ఆ పాత్రలో నటించడానికి అందమైన శిరోజాలు కలిగిన టాబు గుండు చేయించుకోవటానికి సరేనంటుందా? “అసలు నన్ను ఆ చిత్రం కోసం తీసుకున్న తర్వాత కదా ఈ ప్రశ్న తలెత్తేది” అంటూ తప్పించుకుంటుందామె. కాని అందరూ షబానాలా, నందితాదాస్‌లా, పెర్సిస్ ఖంబాట్టాలా ఉంటారనుకోవడం అత్యాశ కదా!